www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025





పూర్తయిన గోకులం షెడ్



మహానాడుకు హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అభివాదం తెలుపుతున్న లోకేష్, చంద్రబాబు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- ప్రతినిధుల సభతో మహానాడు ప్రారంభం
- పసుపు మయమైన కడప నగరం
- మార్మోగిన డప్పు, సంగీత వాయిద్యాలు
- అలరించిన పాటలు, నృత్య ప్రదర్శనలు
- ఆద్యంతం ఆసక్తిగా నేతల ప్రసంగాలు
- అనుకూలించిన వాతావరణం



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



టిడిపి జెండా ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరం పసుపుజెండాల రెపరెపలతో పసుపుమయమైంది. రహదారులు మొదలుకుని బ్రిడ్జిలు, కూడళ్ల వరకు ఎక్కడ చూసినా పసుపు జెండాలు రెపరెపలాడాయి. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, చంద్రబాబుల పేర్ల నినాదాలతో మార్మోగి పోయాయి. కళాకారుల పాటలు, బాలబాలికల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డప్పుల వాయిద్యాలు, యువకుల కేరింతలు, మహిళలు పసుపు దుస్తులు ధరించి ఉల్లాసంగా కదిలి వచ్చారు. వందలాది మంది వాలంటీర్ల పర్యవేక్షణలో టిడిపి జెండాలను చేత పట్టుకుని మహిళలు ప్రదర్శనగా నడుచుకుంటూ వచ్చిన తీరు అద్యంతం ఆకట్టుకుంది. మహానాడు సభనుద్దేశించిన చేసిన నేతల ప్రసంగాలు ఉత్తేజ పరిచాయి. చైతన్య స్ఫూర్తితో అత్యంత ఉత్సాహపూరితంగా మంగళవారం టిడిపి 44వ మహానాడు కార్యక్రమం ప్రారంభమైంది.

కడప నగర శివారులోని పబ్బాపురం సమీపంలో మహానాడు కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. మహానాడుకు ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షత వహించారు తొలిరోజు ప్రతినిధుల సభతో మొదలుకుని బుధవారం పార్టీ సంస్థాగత నిర్మాణం, గురువారం మధ్యాహ్నం అనంతరం ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభతో ముగియనుంది. కోట్లాది రూపాయల వ్యయంతో భారీ తెలుపు, పసుపు రంగుల షెట్టర్లను ఆకట్టుకునే విధంగా నిర్మించారు. టిడిపి జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఎపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బక్కెన నరసింహులతోపాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో పసుపుదండును తలపించింది.

అనుకూలించిన వాతావరణం : మూడ్రోజులుగా సాయంత్రం పూట సన్నని జల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సభావేదిక ప్రాంగణమంతా బురదమ యంగా మారింది. కానీ మహానాడు తొలిరోజు ఉదయం నుంచి సా యం త్రం వరకు చల్లని వాతావరణంతో ఆలరించింది. దీంతో మహానాడుకు హాజరైన కార్యకర్తలు, నాయకులు చల్లని వాతావరణంలో సేద తీరినట్లు కనిపించింది.

కుప్పకూలిన హోర్డింగులు, స్వాగతం బోర్డులు

కడప : మహానాడు సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు సభ ప్రారంభం కాకముందే గాలికి పడిపోయాయి. అప్రమత్తమైన పోలీసులు, ప్రజలు ఆ ప్రమాదం నుండి తప్పించుకున్నారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.



గాలివానకు పడిపోయిన హోర్డింగ్, బ్యానర్లు



మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు



వేదికపై ప్రతినిధులు



సిఎం నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

చేనేత సొబగులు : మహానాడు ప్రాంగణంలోనూ నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా చేనేత స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు 11 స్టాళ్లను మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10 వేల విలువ చేసే చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. తనతో పాటు వచ్చిన అనుచరులతోనూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయించారు. అక్కడే డ్వాక్రా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఫుడ్, ఇతర స్టాళ్లను పరిశీలించారు.

పార్కింగ్ స్థలం పరిశీలన : రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పట్టణంలోని రింగ్ రోడ్డు సర్కిల్, ఆర్‌టిఒ కార్యాలయ సమీపంలో సహచర మంత్రులు, ఎస్‌పి కలిసి వాహన పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఆర్‌టిఒ అధికారులు, సిబ్బంది సహకరించాలని మంత్రి సూచించారు.



మహానాడు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

కడప అర్బన్ : మహానాడులో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, లోకేష్ రాజకీయ ప్రస్థానం, కార్యక్రమాలతో రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్ నాయకులను కార్యకర్తలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎన్‌టిఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించారు, ప్రజలతో ఎలా మమేకమయ్యారు, రాజకీయ ప్రసంగాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌లో డిజిటలైజేడ్ టెక్నాలజీతో ఎల్ఇడి స్క్రీన్‌లపైన ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ తోపాటు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫొటో ఎగ్జిబిషన్ ప్రాంగణం నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడింది.

రక్తదానం చేసిన శ్రీనివాసరెడ్డి : ఎన్టీఆర్ రక్తదాన క్యాంపులో మొట్ట మొదటి రక్తదాతగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి రక్తదానం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రక్తదాతగా గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు.

వేలాదికి మందికి భోజన సదుపాయాలు : మహానాడును పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వేలాది మంది నాయకులకు, కార్యకర్తలకు కడప, అన్నమయ్య జిల్లాల శివారు ప్రాంతాలలో భోజన సదుపాయాలు కల్పించారు. ప్రాంగణంలో ఉన్నవారికి నీరు, మజ్జిగతో పాటు భోజనాలన సౌకర్యాలు కల్పించారు. విజయవాడ నుంచి ప్రత్యేకంగా వంటకాలు చేసేందుకు మాస్టర్లు, వారి బందం హాజరయ్యారు. ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు నాయకులు పర్యవేక్షించారు.

కడప 'ఉక్కు'కు శ్రీకారం

- 15 రోజుల్లో పనులు ప్రారంభం

- మీడియా చిట్‌చాట్‌లో నారా లోకేష్



మాట్లాడుత్ను లోకేష్

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులకు శ్రీకారం చుడతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళవారం తొలిరోజు ప్రతినిధుల సభ భోజనానంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెప్పారు. రాష్ట్రం నుంచి జిందాల్, ఆల్ట్రాటెక్ పరిశ్రమలు తరలిపోతున్నాయనే ప్రశ్నకు స్పందించారు. కడప జిల్లా నుంచి ఉక్కు పరిశ్రమ ఎక్కడికీ పోలేదని, 15 రోజుల వ్యవధిలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభమవుతాయని చెప్పడం గమనార్హం. ఆల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ సైతం ఎక్కడీ వెళ్లనివ్వబోమని, ఇది వైసిపి సర్కారు కాదని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసిపి చేసిన దాడుల్లో తీవ్ర గాయాలపాలైన వారిలో కొందరికి గుర్తింపు లేని పదవులు ఇచ్చారనే ప్రశ్నకు స్పందించి రొటేషన్ ప్రకారం ఇస్తామని, అందరికీ ఒకేసారి ఇవ్వలేమని పేర్కొనడం గమనార్హం. పాఠశాల విద్యలో సంస్క రణల కారణంగా పాఠశాలలు మూతబడుతున్నాయనే ప్రశ్నకు స్పందించి ఒక్క పాఠశాలను మూసివేయబోమని సమాధానం చెప్పడం గమనార్హం.

గోకులం..బిల్లులకు ఎంత కాలం?

ఎదురుచూస్తున్న లబ్ధిదారులు - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-వీరబల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద నిర్మించిన గోకులం షెడ్లకు బిల్లులు రాకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులు గోకులం షెడ్డు నిర్మించుకోవాలని ఆశ ఉన్నా... బిల్లులు వచ్చే పరిస్థితి కనపడలేదని నిరుత్సాహంతో ఉన్నారు. పశు పోషకులు గోకులం షెడ్లు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలో నిర్మాణ పనులు వదిలేయలేక డబ్బులు అప్పు తెచ్చుకొని గోకులం షెడ్డు నిర్మించుకుంటే బిల్లు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి అంటున్నారు. మరి కొంతమంది గోకులం షెడ్లు నిర్మాణ పనులు అసలు ప్రారంభించలేదు. గత వైసిపి ప్రభుత్వం గోకులం షెడ్ల పథకానికి మంగళం పాడింది. కూటమి ప్రభుత్వం వచ్చిందని, ఆసక్తి ఉన్న పాడి రైతులకు గోకులం షెడ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఫారం షెడ్లు మంజూరయ్యాయని రైతులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. రైతులు తమ వంతుగా 10 శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన యూనిట్ మొత్తాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఐదు నెలల నుంచి బిల్లులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే డబ్బులు వస్తాయని నమ్మకంతో అప్పులు తెచ్చుకుని మరి షెడ్లు నిర్మించారు. ఇప్పుడు బిల్లుల కోసం ఉపాధి కార్యాలయం చుట్టూ రైతులు తిరిగి తిరిగి అలచిపోతున్నారు. బిల్లులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం.

40 షెడ్లు పూర్తి

మండలంలో గోకులం షెడ్లు 48 షెడ్లు మంజూరయ్యాయి. 40 షెడ్లు పూర్తయ్యాయి. 6 షెడ్లు పనులు ప్రారంభించారు. 2 షెడ్లు పనులు ప్రారంభించలేదు. పూర్తయివాటికి బిల్లులు రాలేదు. ప్రభుత్వం ఆరు పశువుల షెడ్డుకు రూ 2.30 లక్షల్లో రూ.23 వేలు లబ్ధిదారుని వాటా ఉండగా, మిగిలిన రూ.2.07 లక్షలు ప్రభుత్వం చెల్లించాలి.

అప్పు తెచ్చి షెడ్డు నిర్మించుకున్నాం..

ఆరు ఆవుల మినీ గోకులం షెడ్డు మంజూరైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రైతులకు పశువుల షెడ్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. డబ్బులు వడ్డీకి తెచ్చి షెడ్డు పనులు పూర్తి చేశాను. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో వడ్డీకి తెచ్చిన చోట డబ్బులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాను. కూటమి ప్రభుత్వం పశువుల షెడ్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరుకుంటున్నాను.

- పెద్దివీటి కదిరయ్య, రైతు, వంగిమళ్ళ.

బిల్లు రాక అవస్థలు పడుతున్నాం

నాలుగు గేదెల షెడ్డు మంజూరైంది. గత వైసిపి ప్రభుత్వం గోకులం షెడ్ల గురించి పట్టించుకోలేదు. టిడిపి ప్రభుత్వంలో త్వరగా బిల్లులు వస్తాయని నమ్మకంతో ఒక రైతు దగ్గర వడ్డీకి డబ్బులు తెచ్చి ఇస్తే తిరిగి బిల్లులు వచ్చిన తర్వాత వడ్డీతో కూడా కట్టిస్తానని చెప్పి డబ్బులు తెచ్చి షెడ్డు పూర్తి చేశాను. షెడ్డు పనులు పూర్తయి మూడు నెలలు కావస్తుంది. ఇంతవరకు బిల్లులు పడలేదు. డబ్బులు తెచ్చిన చోట నమ్మకం మాట పోయింది. చాలా ఇబ్బంది ఉంది. కూటమి ప్రభుత్వం గుర్తించి షెడ్లు నిర్మించుకున్న రైతులకు బిల్లులు మంజూరు చేయాలని కోరుకుంటున్నాను.

- తోళ్ళ చిన్న వీరనాగయ్య, రైతు, పెద్ద మాదిగపల్లి.

బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా

కూటమి ప్రభుత్వంలో గోకులం షెడ్డు మంజూరైదని బంగారు నగలు, బ్యాంకులో పెట్టి డబ్బులు తెచ్చి గోకులం షెడ్డు పూర్తి చేశాను. బిల్లు వస్తే నగులు విడిపించుకుందాం అనుకున్నా... బిల్లు రాకపోవడంతో ఎంత తెలుసుకుని వాడివి వడ్డీలు ఎక్కువైపోతున్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు రైతుల గురించి ఆలోచించి గోకులం షెడ్డు బిల్లులు మంజూరు చేయాలి.

- శ్రీధర్, రైతు, వీరబల్లి.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల బిల్లులకు సంబంధించిన వివరాలు ఉన్నతాధికారులకు ప్రతిపాదనల పంపాం. నిధులు మంజూరు కాకపోవడంతో బిల్లును చెల్లించలేకపోయాం. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే లబ్ధిదారుల అకౌంట్లో బిల్లులు వస్తాయి అన్నారు.

- చంద్రకళ, ఎపిఒ.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీలో ఐదేళ్లుగా దినసరి వేతన పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న 70 మందికి వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధ సంస్థ సభ్యులు మంగళవారం మున్సి పల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ కోశాధికారి రామకృష్ణ, ఐటియుసి కన్వీనర్ జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో మున్సిపాలిటీలో 70 మంది పారిశుధ్య కార్మికులుగా చేరారన్నారు. ప్రతినెల వేతనాలు సక్రమంగా అందడం లేదని, గత ఐదు నెలలుగా జీతాలు అందకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కౌన్సిల్ సమా వేశంలో చర్చించి జనరల్ నిధుల నుంచి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మి కులకు గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని, వెంకప్పకోటలో స్థలాలు కేటాయించి ప్లాట్ల నంబర్లు కూడా ఇచ్చారన్నారు. ఇంత వరకు పట్టాలు మంజూరు చేయకపోవడంతో ఇల్లు నిర్మించుకుంటే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వెంటనే కార్మి కులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు దినసరి వేతన కార్మికులను ఆప్కాస్ విధా నంలోకి చేర్పిస్తామని మభ్యపెట్టి వారి వద్ద వేల రూపాయలు అక్రమ వసూలు చేశారని, ఆ వసూ ళ్లపై సమగ్ర విచారణ జరిపి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని కార్మికుల వద్ద నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి వారికి ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు మంజుల, వెంకటరమణ, రాజు, కృష్ణప్ప, ఉత్తన్న, చిన్న రెడ్డప్ప, రమణమ్మ, శివమ్మ, సంగీత, శంకరమ్మ పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి : కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బుధవారం మదనపల్లె బిటి కాలేజీ మైదానంలో నిర్వహించే మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ క్షేత్ర స్థాయి అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వ యంతో పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. యోగా నిర్వహించే బిటి కళాశాల మైదానంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. యోగా చేయడానికి అను వుగా మైదానంలో మ్యాట్ ఏర్పాటు చేయాలని, వచ్చిన వారందరికీ తాగునీటి ఏర్పాట్లు తప్పని సరిగా ఉండాలన్నారు. శిక్షకులు చెప్పే యోగా ఆసనం అందరికీ వినపడేలా మైక్ ఏర్పాటు చేయా లన్నారు. అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు, హెల్పర్లు, ఎఎన్ఎంలు, మెడికల్ అధికారులు, ఆశాలు క్రమశిక్షణతో సంఘటితంగా కార్యక్రమాన్ని విజయ వంతం చేసేలా అధికారులు అవగాహన కల్పించా లన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ ధనుంజయులు, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, డిఆర్‌డిఎ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లె: విద్యార్థులు విద్యార్థి దశ నుండి యోగా పట్ల అవగాహన పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ యోగా మాస్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక బిటి కళాశాల హాకీ గ్రౌండ్‌లో హాకీ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు యోగా వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తుం దని, తద్వారా విద్య పట్ల ఆసక్తి పెంచుతుం దన్నారు. నిర్వాహకులు దివ్యభారతి బుక్ సెంటర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా వల్ల కలిగే ఉపయోగాలు గుర్తించి యోగాను పాటించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు క్రీడలు, యోగాను అవలంభిస్తే సంపూర్ణంగా ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు నౌషాద్, గౌస్ భాష, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ దూరం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అవగాహనతోనే క్షయ దూరం చేయవచ్చని, వంద రోజుల టిబి వ్యాధి క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ జులేఖ బేగం అన్నారు. మంగళవారం చింతపర్తి పిహెచ్‌సి ఆవరణంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో టిబి వ్యాధిని మూడు పద్ధతుల ద్వారా నియంత్రణ చేయవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ భూపతి, సూపర్‌వైజర్ సుధాకర్, భానుభి, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు విజయవంతం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సమీపంలోని విశ్వం విద్యా సంస్థలో ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు 10 రోజులపాటు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు విజయవంతమయ్యాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శిక్షణా తరగతులు విజయవంతానికి ప్రధానంగా విశ్వం విద్యాసంస్థల చైర్మన్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మదనపల్లి పట్టణంలో ఉన్న వివిధ మేధావులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు, ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోవు ఉద్యమకాలానికి మదనపల్లి పట్టణం వేదిక కావడం చాలా సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళ్లడం జరుగుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీ యింబర్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఇంటర్మీడియట్, ప్రభుత్వ పాఠశాలలో, కెజిబివిలు విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాల సకాలంలో ఇవ్వాలని కోరారు. అలా లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద వేల రూపాయలు వసూలు చేయడాన్ని ఎస్‌ఎఫ్‌ఐగా అడ్డుకుంటామని తెలిపారు. వీటన్నింటి పైన భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి తల్లిదండ్రుల పక్షాన ఎస్‌ఎఫ్‌ఐ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ క్లాసులు జయప్రదానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఎస్‌ఎఫ్‌ఐ అన్నమయ్య జిల్లా కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీ కార్మికులకు సమ దుస్తులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, పంచాయతీ ఇఒ గురు మోహన్ తెలిపారు. పంచాయతీ కార్మికులకు ప్రతి ఏడాది అందించే యూనిఫాంలో భాగంగా మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు, నీటి సరఫరా చేసే సిబ్బందికి, విద్యుత్ కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతల వంతున యూనిఫామ్ పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్మికులకు అందాల్సిన ఇతర వస్తువులను కూడా త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు కార్యక్రమంలో పంచాయతీ ఇఒ గురుమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డు సభ్యులు ఆబిద్, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పిక్కా రమణ, కాలేష, ఫర్మాన్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పేద వర్గాల సంక్షేమమే వైసిపి లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేద వర్గాల సంక్షేమమే వైసిపి లక్ష్యమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం వాల్మీకిపురం మండల అధ్యక్షుడిగా నియమితులైన శ్యామ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ పాలనలో పేద వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసి పలు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వైసిపిలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన దిశగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని నడుపుతున్నట్లు తెలిపారు. సంస్థాగతంగా వైసిపి కమిటీలలో నియమితులైన వారు పార్టీ ఆశయాలు, లక్ష్యాలను గ్రామీణ ప్రజల్లోకి తీసుకెళ్లి వైసిపి బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు చింతల శివానందరెడ్డి, నియోజకవర్గ వైసిపి బిసి విభాగం అధ్యక్షులు నీళ్ల భాస్కర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ఎంపిటిసి రాజేష్, నాయకులు సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, కేశవరెడ్డి, అమిన్ పీర్, రెడ్డి ప్రసాద్, వేణు, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న రామలక్ష్మి

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-చిన్నమండెం

14 నుంచి18 సంవత్సరాల లోపు వయసు కలిగిన కిశోర బాలికలు బాలల హక్కులు , రక్షణ పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మి, మల్లూరు సెక్టర్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పవనకుమారి పేర్కొన్నారు.మండలంలోని చాకివాడ పంచా యతీ ఎబి వాళ్ళ పల్లె అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగం గా బాలికలకు కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం2006, బాల కార్మిక నిరోధక చట్టం, బాలల విద్యా హక్కు చట్టం, 14 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్బంధ విద్య హక్కు చట్టం వివరించారు. మహిళలపై బలా త్కరణ, దాడి, పోక్సో చట్టం అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తమలక్ష్యాలను నిర్ధారిం చుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకును అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, కిశోర బాలికలు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందిస్తున్న రామచంద్రారెడ్డి

పిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి చేతుల మీదుగా ప్రధానమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేసినట్లు వైసిపి మైనార్టీమండల ఉపాధ్యక్షుడు వేంపల్లి బావాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడికుర్తికి గ్రామం ఆసాదివారిపల్లికి చెందిన టి.నాగార్జున భార్య సంధ్యకు అనారోగ్యంతో ఆపరేషన్ చేసుకున్నారని తెలిపారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి సహకారంతో ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ మంజూర అయిందని తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు వేంపల్లి ఫయాజ్, మండల దూదేకుల సంఘం అధ్యక్షుడు నజీర్‌బాషా, యాసన్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథరెడ్డి జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక వైసిపి నాయకుడు కసిరెడ్డి శ్రీరాములురెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకుపండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందదగ్గ విషయమని విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి అన్నారు. ప్రజా నాయకుడు రాజన్న ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకో వాలని ఆకాక్షించారు. అనంతరం ఈడిగ పల్లిలో రాజేంద్ర నాథ్‌రెడ్డి, యువత పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనీషా, శ్రీనివాసులు రెడ్డి, శివరామక్రిష్ణ గౌడ్, జగిలి రవిబాబు, చిన్న రెడ్డి, శ్రీకాంత్, వెంకటరామిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు రమాబాయి కృషి

ప్రజాశక్తి-పీలేరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దేశ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన ప్రతి పోరాటానికి రమాబాయి అంబేద్కర్ ఆలంబనగా నిలిచి అందించిన కృషి మరువలేనిదని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో మండల యువజన అధ్యక్షులు జెట్టి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ 90వ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిసి నాయకులు కాయితిరవి, మాల మహానాడు మండల కార్యదర్శి మద్దెల బాలగంగాధర్, కార్యవర్గ సభ్యులు తుమ్మల రవిచంద్ర, రమేష్, రెడ్డి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

'ఉపాధి' పనులను వేగవంతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య 1370కు పెంచాలని సూచించారు.1200 మంది కూలీలు పనిచేస్తున్నారని అన్నారు. హార్టికల్చర్ రైతులందరికీ పండ్ల తోటల పెంపకంలో 200 ఎకరాలు మండలానికి నిర్దేశించినట్లు తెలిపారు. మండలంలో 225 కంపోస్ట్ మంజూరు అయినట్లు తెలిపారు. ముఖ్యంగా ఫారంపాండ్స్ ఈనె లాఖరుకు 263 నిర్దేశిం చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 185 మాత్రమే పూర్తి చేశారని, తర్వగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. సమావేశంలో క్లస్టర్ ఎపిడి నందకుమార్ రెడ్డి, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ బాబాజీ, ఎపిఒ వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి 'కూలి' కోసం ఎదురుచూపులు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-వీరబల్లి

ఉపాధి హామీ వేతన దారులు కూలి డబ్బులు కోసం ఐదు వారాల నుంచి కూలీలు ఎదురు చూస్తున్నారు. ఉపాధి శ్రమజీవులు తెల్లవారుజామున ఆరు గంటల నుంచి పనికి వెళ్లి, పనిచేసి, తిరిగి 11 గంటలకు ఇంటికి చేరుకుంటారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. వారానికి ఒక్కసారి ఉపాధి కూలీ డబ్బులు పడకపోతే పూట గడవని పేదరికం కూలీలది. మండలంలో పేద, నిరుపేద కుటుంబాలు ఉపాధి హామీ చట్టం పనుల పైన ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలో 12 గ్రామపంచాయతీల్లో 8821 జాబ్ కార్డులు ఉండగా 15752 మంది వేతన దారులు పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం పని చేసిన వారికి వారానికి ఒకసారి ప్రభుత్వం వేతనం అందించాల్సింది. కానీ ప్రభుత్వంలో చలనం లేక నిబంధనలన్నీ మస్టర్ కాగితాలకే పరిమిత వుతున్నాయి. వారాలు తరబడి వేతన దారులకు నగదు చెల్లింపులు నిలిచిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం వేతనాలు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఒక్కొక్క వేతన దారునికి రోజుకు రూ. 302 గా నిర్ణయించింది. దీంతో మండల వ్యాప్తంగా వేతన దారులు ఉపాధి హామీ పనులకే మొగ్గు చూపుతున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో ఇంకుడు గుంతలు, కాలువలలో పూడికతత, పశువులకు నీటి తొట్లు, తదితర పనులు చేపడుతున్నారు. కానీ నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధి వేతనదారులు కష్టాలను గమనించి బిల్లులు వారానికి ఒకసారి చెల్లించాలని కోరుతున్నారు.

కుటుంబం గడవడం కష్టంగా ఉంది



కూటమి ప్రభుత్వం వేతనం పెంచడంతో గర్భిని అయిన నేను, నా భర్త ఉపాధి హామీ పనికి వెళ్తున్నాం. పనికి వెళ్లి ఐదు వారాలు గడుస్తున్నాయి. ఇంతవరకు డబ్బులు పడలేదు. చిన్న బిడ్డలతో ఇబ్బందులు పడు తున్నాం. పూట గడవడం కష్టంగా ఉంది. మాలాంటి పేదలు చాలామంది ఉన్నారు. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకొని న్యాయం చేయాలి

-నారాయణమ్మ, వీరబల్లి

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



జీవనాధారం కోసం ఉపాధి పని కోసం కుటుంబం సైతం వెళుతున్నాం. ఏరోజుకారోజు కూలి వస్తే పూట గడవడం కష్టం. అలాంటిది వారాల తరబడి వేతనాలు చెల్లించకపోతే మా బాధలు ఏ ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఉపాధి వేతన దారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాం. మా బాధను అర్థం చేసుకొని వేతనాలు తొందరగా చెల్లించాలి

- ఖాదీ రూన్,వంగిమళ్ళ

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఉపాధి పథకం ద్వారా వేతనదారులకు వేతనాలు పడాల్సి ఉంది. ప్రభుత్వం వేతనాలు విడుదల చేసిన వెంటనే కూలీల బ్యాంకు అకౌం ట్లో వేతనాలు పడతాయి. వేతనదారులు దిగులు పడాల్సిన అవసరంలేదు.

- నూర్జహాన్, ఎంపిడిఒ, వీరబల్లి

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ



మదనపల్లి : హాస్టల్‌లో దోమల మందు పిచకారి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో ఉన్న వసతి గృహాల్లో దోమల నివారణ మందును పిచికారి చేసినట్లు మదనపల్లి సబ్ యూనిట్ అధికారి ఖాలీలుల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవికాలంలో పాఠశాలలకు సంబంధించిన వసతి గృహాలలో దోమల నివారణ కోసం మందులను పిచికారి చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు పర్యవేక్షణలో రెడ్డివారి పల్లి మోడల్ స్కూల్ కి సంబంధించిన వసతి గృహం, ముష్టూరు కెజిబి పాఠశాలకు సంబంధించిన వసతి గృహాలలో దోమల నివారణ మందులను పిచికారి చేశామన్నారు. త్వరలో పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో దోమల నివారణ మందులను పిచికారి చేయడం వలన దోమల ప్రబలకుండా నివారించవచ్చని అన్నారు. విద్యార్థులు దోమ కాటు వలన కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, బోదకాలు, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా నివారణ మందులను పిచికారి చేసి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు దేవేంద్ర, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె :** మదనపల్లె రూరల్ పాలిటెక్నిక్ కాలేజీ, జవహర్ నవోదయ విద్యాలయ హాస్టల్‌లో దోమల నివారణకు దోమల మందును పిచకారి చేసినట్లుసబ్‌యూనిట్ ఆఫీసర్ ఖలీలుల్లాఖాన్ తెలిపారు. కీటక జనిత వ్యాధులు ఐన మలేరియా, డెంగీ , చికెన్ గున్యా , బోదకాలు, మెదడువాపు జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవడమైనదని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు , పర్యవేక్షకులు, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు సముచిత స్థానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో మహిళా సభ్యులకు పాల ఉత్పత్తి పై అవగాహన కార్యక్రమాన్ని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏరియా మేనేజర్ వైవి.నారాయణరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీజ డెయిరీ ప్రపంచంలో మహిళల పాల ఉత్పత్తిదారుల కోసం ఏర్పడిన సంస్థ అన్నారు. సంస్థలో బోర్డ్ సభ్యుల నుంచి చైర్మన్ వరకు అందరూ మహిళా పాల ఉత్పత్తిదారులు ఉండటం విశేషమని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా శ్రీజ డెయిరీ మహిళా ఉత్పత్తిదారుల ద్వారా ప్రతిరోజు 7 లక్షల లీటర్లకు పైగా పాలను గ్రామస్థాయి నుంచి సేకరిస్తోందన్నారు. పాలను ప్రాసెసింగ్ తర్వాత మదర్ డెయిరీ సహకారంతో మార్కెటింగ్‌లో పాలు, పాల పదార్థాలుగా వినియోగదాలకు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామస్థాయి విసిజి, ఎంఆర్‌జి మహిళా సభ్యుల విధులు, బాధ్యతలను వివరించారు. గ్రామస్థాయిలో కనీసం ముగ్గురు నుంచి ఏడు మంది విసిజి లను గ్రామస్థాయి పాల సేకరణ కేంద్రాన్ని బట్టి ఎన్నుకోవడం జరుగు తుందని వీరికి చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందన్నారు. పాల నాణ్యత పెరుగుదల కోసం ఆవులకు నాణ్యమైన క్యాటిల్ ఫీడ్, మినరల్ మిక్చర్ వంటి బలమైన దానాను వాడాలని సూచించారు. శ్రీజ డెయిరీ పాల సరఫరా లో మహిళా పాల ఉత్పత్తిదారులు డైరీకి ఒక వారధి లాంటివారని పేర్కొన్నారు. శ్రీజ డెయిరీలో పాల ఉత్పత్తిదారులు వాటాదారులుగా ఉండడం విశేషం అన్నారు. 53 మంది పాల ఉత్పత్తిదారుల మహిళా సభ్యులకు ప్రోత్సాహకాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం మురళీ, పిఐబి ఎగ్జిక్యూటీవ్ మనోజ్ కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ హరీష్, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తి దారులకు అవగాహన కల్పిస్తున్న డెయిరీ ప్రతినిధులు

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : సిఐటియు



మాట్లాడుతున్న సి.హెచ్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మామిడి రైతులకు గిట్టు బాటు ధర కల్పించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్, ఎపి రైతు సంఘం మండల కన్వీనర్, టి.సుభాన్ కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడూరులో 70 మండిలు ఉండగా 40 మాత్రం సరుకు కొనుగోలు, అమ్మ కాలు చేస్తున్నారని అన్నారు. ప్రయివేట్ మార్కెట్ యార్డ్‌కు నియోజ కవర్గం లోని కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండ లాల నుంచి రైతులు మామిడిని సరఫరా చేస్తుంటారు. చిత్తూరు జిల్లాలో ప్రయివేట్ మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు దాదాపు 200 దాకా ఉన్నాయని అన్నారు. వారు సిండికేట్‌గా ఏర్పడి గతంలో ఉన్న ధరల కన్నా సగానికి సగం తగ్గించి వేశారని, వీటి పైన విచారణ జరిపి చర్యలు తీసుకొని వాటి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. పులిహోర మామిడికాయలు టన్ను రూ.5వేలకు కొనుగోలు చేస్తున్నారని, గతంలో రూ.15వేలు ఉండేదన్నారు. తోతపురి, బెంగళూరు కాయలు టన్నురూ. 7 వేలకు కొనుగోలు చేస్తున్నారని, గతంలో రూ.20 వేలకు కొనుగోలు చేసే వారని అన్నారు. రూమాని పది రూపాయలు, బెనిష, కిలో రూ.15లు ఉందన్నారు. గత ఏడాది రూ. 50 రూపాయలు పైన ఉండేద న్నారు. నాటు రకం ఆరు రూపాయలకు కొను గోలు చేస్తున్నారన్నారు. నీలం ఇంకా కోతకు రాలేదని ఈ ఏడాది మామిడి కాపు తక్కువ ఉన్నందున ధర పెరగాల్సి ఉందన్నారు. కానీ మధ్య దళారు లు, ధర పెట్టడం లేదన్నారు. రైతుల నుంచి మూడు రూపాయలు, వ్యాపారస్తులు నుంచి రెండు రూపాయలు, గతంలో ఉండేదని దాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. సూటు,తోపు పేరుతో టన్నుకి 40 కేజీలు రైతుల నుంచి తీసుకొని వ్యాపారస్తులకు మోసం చేస్తున్నారన్నారు. మామిడి రైతులకు అన్ని రకాల వస్తువులు ధరల పెరిగాయి అన్నారు. ట్రాక్టర్ దుక్కెలు, కూలీలు ఖర్చులు, ఎరువులు, మందులు రైతు వాడే ట్రాక్టర్ స్పేర్ ధరల పెరగడం, జిఎస్‌టి వేయడం, రైతులకు భారమైందన్నారు. తవ్వకం కూలీలు ఖర్చు, కోత కూలీలు, రోజు కూలీలు ఒక్కోరికి రూ.500, సరుకు ట్రాన్స్‌ఫోర్ట్, లోడ్ చేసినందుకు కూలి ఖర్చు, టన్నుకు రూ.350లు ఇవ్వాల్సిందన్నారు. మామిడి రైతు పెట్టిన పెట్టుబడి, రావడంలేదని, రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతు గిట్టుబాటు ధర లేక, సబ్సిడీ రాక జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యం, దళారుల మధ్య దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా, గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో మామిడి, బొప్పాయి, అరటి, ఇతర రైతుల సమస్య లపై చర్చించి న్యాయం చేయాల న్నారు. కోడూరులో మూసివేసిన అప్ప జ్యూస్ ఫ్యాక్టరీ తెరిపించాలని, ఒక భారీ పండ్ల జ్యూస్ పరిశ్రమ, ప్రభుత్వ ఆధ్వర్యంలో రైల్వే కోడూరు మండ లంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిటిసి కౌన్సిలర్ రవి, కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ సుమలత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, పీలేరు కోర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కళాబృందం ఆధునిక వీధి నాటికల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఆ వ్యాధి సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, బాధితుల పట్ల వివక్ష చూపకుండా ఎలా కలసి జీవించాలనే అంశాలపై అవగా హన కల్పించారు. హెచ్ఐవి, ఎయిడ్స్, క్షయ వ్యాధి, సుఖ వ్యాధు లు వాటి చికిత్స గురించి, కండోమ్ ఉపయోగం, హెచ్ఐవి, ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజలకు నటరాజ్ కళా బృందం వివరించి చెప్పారు. ఎయిడ్స్ రోగులపై వివక్ష చూపరాదని, వారిని ఆదరించాలని అన్నారు. హెచ్ఐవి రోగితో మాట్లాడిన, కరచాలనం చేసినా వ్యాధి రాదని అన్నారు. రక్తమార్పిడి, లైంగిక సంబధాలతోనే వ్యాధి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి ఐసిటిసి కౌన్సిలర్ రవి, కోర్ సంస్థ ఔట్ రీచ్ వర్కర్లు రాజమ్మ, శైలజ, పిఈలు మల్లీశ్వరి, మునీశ్వరి, అనిత, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ఇంటి స్థలాలు, వడ్డీ ఆశచూపి..

అమాయకులకు కుచ్చుటోపీ

-30 మంది వద్ద రూ.3.50 కోట్లకు పైగా స్వాహా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో వివిధ ప్రదేశాలలో నివాసం వుండే సుజాత, గౌరీ, నాగమణి, నాగరత్న, పెరవలి నళిని, పద్మప్రియ, లావణ్య, సునీల్ సామూహంగా ఏర్పడి ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని వారికి ఇంటి స్థలాలు, వడ్డీ ఆశ చూపి తమ వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని మోసం చేశారని బాధితులు మంగళవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఎఒ రాఘవేంద్ర రావుకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో అనురాధ, సుగుణ, సుజాత, శ్రీదేవి, దేవి, నజీనా, ఖాదర్ వలి, భారతి, నవీన్, సరోజమ్మ, లక్ష్మి, ఏకాంబర రెడ్డి, ధనుంజయ, సరస్వతి, సునీత తదితర బాధి తులు ఉన్నారు. వీరందరూ సబ్ కలెక్టర్ దృష్టికి తమకు జరిగిన అన్యాయంపైన విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు చేసిన మోసాలపైన కోర్టులో కేసులు వేసి ఎస్‌పి, డిఎస్‌పిలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తమపై ఇచ్చిన కేసులు, ఫిర్యాదులు వాపసు తీసుకోవాలని ఒత్తిడి తీసుకు రావడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3.50కోట్లు వరకు తీసుకొని మోసం చేశారని ఆరోపించారు. మీరిచ్చిన డబ్బుకు ధోకా ఉండదని నమ్మబలికి బ్యాంకు చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చి డబ్బు తీసుకున్నారని తెలిపారు. తిరిగి చెల్లించమని అడిగినప్పుడల్లా కాలయాపన చేయడం, ఇచ్చేది లేదని చేతనైంది చేసుకోండని ఎదురు తిరిగి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి తగిన న్యాయం చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలన్నారు.ఈ అంశాన్ని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

'మిట్స్'లో రీ-ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 'రీ-ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ అరవింద్ హజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత ఎదుగుదల, భావోద్వేగ శ్రేయస్సుపై దృష్టి పెట్టాలని సూచించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ లక్ష్యం చాలా ముఖ్యమైందని, దాన్ని చేరుకోవడంలో కృషి తప్పనిసరని చెప్పారు. మనస్తత్వ పరివర్తన విద్యార్థి జీవితంలో కీలకమని పేర్కొంటూ, సానుకూల ఆలోచన, స్వీయ క్రమశిక్షణ, భావోద్వేగ మేధస్సును పెంపొందించుకోవడం ద్వారా విద్యా, వ్యక్తిగత సవాళ్లను అధిగమించవచ్చని వివరించారు. ఒత్తిడిని నిర్వహించడంలో, ప్రతికూల ఆలోచనలను తిప్పి కొత్త దృక్పథంతో ముందుకు సాగడంలో అవసరమైన పద్ధతులపై డాక్టర్ అరవింద్ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఆలోచనలు, భావనలు, ప్రవర్తన నైపుణ్యాలను మెరుగు పరచు కోవడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్ చంద్రమోహన్, ఇంటర్నేషనల్ డిపార్ట్మెంట్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశాభివృద్ధికి మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బాటలు వేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ అన్నారు. మంగళవారం పండిట్ జవహర్‌లాల్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు, దేశాభివృద్ధిని చేసిన కృషిని కొనియాడారు. తొలి ప్రధానిగా భారతదేశానికి నెహ్రూ విశేషమైన సేవలు అందించారన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అనేక సంస్క రణలు ప్రవేశ పెట్టారన్నారు. ఆయన ఆశయాలను రాహుల్‌గాంధీ కొనసాగిస్తారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మదనపల్లె నియోజకవర్గ సీనియర్ నాయకుడు రెడ్డి సాహెబ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎస్.కె.బాషా, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు మహబూబ్ పీర్, మైనార్టీ సెల్ స్టేట్ వైస్ చైర్మన్ మహమ్మద్ షరీఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గాలివీడు

ఏప్రిల్ 18వ తేదీన మండలంలోని సిసిపల్లి పంచాయతీ కమలామర్రికి చెందిన మహిళపై అత్యాచారం కేసులో నిందితుడు రెపన వెంకటరమణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీరాములు పేర్కొన్నారు. నిందితుడు అప్పటి నుంచి పరారీలో ఉన్నాడని తెలిపారు. మంగళవారం నిందితుడి ఆచూకీ లభించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష

- రూ.15 లక్షలు జరిమానా

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

చెక్ బౌన్స్ కేసులో బెంగళూరుకు చెందిన ఓవ్యక్తికి రూ.15లక్షలు జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష పడింది. బెంగళూరుకు చెందిన లోకనాథరెడ్డి 2018లో తంబళ్లపల్లె వాసి రామూర్తికి ఇచ్చిన చెక్కు బౌన్స్ అవడంతో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. విచారణ పూర్తయి నేరం రుజువు కావడంతో లోకనాథ రెడ్డికి రూ.15లక్షలు జరిమానా, ఏడాది జైలుశిక్ష విదిస్తూ తంబళ్లపల్లె జెసిజె కోర్టు జడ్జి ఉమర్‌ఫరూక్ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామానికి చెందిన గిరిజన కులమునకు చెందిన ఈశ్వరమ్మ ఈనెల 23న తన పొలంలోకి ట్రాక్టర్ తోలుకొని రావద్దని వారించి నందుకు, అదే గ్రామానికి సుబ్బారెడ్డి, శివారెడ్డి, లోకేష్‌రెడ్డి, రమాదేవి, పార్వతమ్మ, అనువారు దుర్భాషలాడి కులం పేరుతో దూషించినట్లు స్థానిక పోలీసులకు ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెస్ట్ బెంగాల్‌లో సైబర్ నేరాలకు, మోసాలకు పాల్పడి పారిపోయి మదనపల్లెలో తలదాచుకున్న సైబర్ నేరగాన్ని మంగళవారం వెస్ట్ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐ బిజెయ్ కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్ గోపాల్ గంజ్‌కు చెందిన బిజాస్ను వెస్ట్ బెంగాల్‌లో సైబర్ నేరాలు పాల్పడి పలువురిని మోసం చేశాడని అన్నారు.ఆరు నెలల క్రితం పారిపోయి మదనపల్లెకు మాకాం మార్చాడన్నారు. సాంకేతిక ఆధారాలతో మదనపల్లెలో ఉన్నట్లు తేలడంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. స్థానిక పోలీసుల సాయంతో ఇందిరానగర్‌లో ఉన్న నిందితుడిని బిజాస్ను అదుపులోకి తీసుకొని వైద్య పరీక్షల అనంతరం అరెస్టు చేసి తమ వెంట వెస్ట్ బెంగాల్ తీసుకెళ్తున్నట్లు తెలిపారు.